సాక్షి పల్నాడు

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



హనుమాన్ చాలీసా పారాయణం

గోళ్లపాడు(ముప్పాళ్ల): మండలంలోని గోళ్లపాడు గ్రామంలో ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్‌చాలీసా పారాయణం శనివారం నిర్వహించారు.



వరలక్ష్మి అమ్మవారి వ్రత పూజ

నగరం: మండలంలోని పెద్దవరం గౌడపాలెంలో ఉన్న శ్రీరామాలయంలో వరలక్ష్మి వ్రత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



మార్కండేయ జయంతి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో ఉన్న భద్రావతి సమేత భావనాఋషిస్వామి ఆలయంలో శనివారం మార్కండేయ జయంతి నిర్వహించారు.

ప్రగతి లేని బడ్జెట్ !

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశ పరిచిందనే అభిప్రాయం అన్ని వర్గాల నుంచి వెల్లడైంది. ఒకటి రెండు నిర్ణయాలు మినహా ప్రజలను ఆకట్టుకోలేదన్న వాదన వినిపిస్తోంది. ముఖ్యంగా రాష్ట్రానికి, పల్నాడు జిల్లాకు కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు లేదా ప్రాజెక్టుల మంజూరు ప్రస్తావన లేకపోవడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇది కూటమి ప్రభుత్వ వైఫల్యంగా భావిస్తున్నారు.



- కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై పెదవి విరుస్తున్న ప్రజలు
- వ్యవసాయ రంగానికి రిక్త హస్తమేనంటున్న రైతులు, సంఘాలు
- జిల్లా అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు కాని వైనం
- పర్యాటకం, పరిశ్రమలకు మేలు జరుగుతుందని ఆశించినా భంగపాటే

సాక్షి, నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో ఆంధ్రప్రదేశ్ ఎంపీల పాత్ర కీలంగా ఉన్న నేపథ్యంలో బిహార్ తరహా ప్రాధాన్యం దక్కుతుందని అందరూ భావించారు. కానీ అదేమీ లేకపోవడంతో కూటమి పార్టీల తీరును ఎండగడుతున్నారు. కేంద్ర ప్రభుత్వ పన్నుల విధానం ముఖ్యంగా ఆదాయపన్నుపై గత కొన్నేళ్లుగా వస్తున్న విమర్శలకు కొంత ఉపశమనం కలిగించేలా శనివారం బడ్జెట్‌లో కీలక నిర్ణయం తీసుకున్నారు. వేతన జీవులకు కాస్త ఊరట లభించనుంది. ఈ కేటగిరీ కింద జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు 20 వేల మంది వరకు ఉండే అవకాశం ఉంది. సీనియర్ సిటిజన్ కేటగిరీలో ఎటువంటి రాయితీలు ప్రకటించకపోవడం పట్ల ఆ వర్గం పన్ను చెల్లింపుదారులు పెదవి విరుస్తున్నారు.

అన్నదాతలకు ప్రయోజనం శూన్యం

కేంద్ర బడ్జెట్‌లో రైతులు పెద్దగా ప్రయోజనం కలిగించేలా నిర్ణయాలేవి తీసుకోలేదు. కిసాన్ క్రెడిట్ కార్డు రుణ పరిమితిని గతంలో ఉన్న రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచారు. ఈ నిర్ణయం వల్ల జిల్లాలో కిసాన్ క్రెడిట్ కార్డు కలిగిన 65,143 మంది అదనపు రుణం లభించనుంది. సాగునీటి రంగానికి సంబంధించి ప్రత్యేకంగా కేటాయింపుల ప్రస్తావన లేదు. జాతీయ పత్తి మిషన్ ప్రకటించడంతో పత్తి రైతులకు కొంత మేలు జరిగే అవకాశముంది.



జిల్లాలో పోయిన ఖరీఫ్‌లో 65,826 హెక్టార్లలో సాగు చేశారు. జాతీయ పత్తి మిషన్ రైతులకు అండగా నిలిస్తే గతంలో మాదిరి జిల్లాలో పత్తి సాగు లక్ష హెక్టార్లు చేరే అవకాశముంది. పత్తి ధరలు ఆశాజనకంగా లేకపోవడం, తెగుళ్లు అధికంగా ఉండటంతో రానురాను జిల్లాలో పత్తి సాగు తగ్గుతున్న విషయం తెలిసిందే.

తాగునీటికి ఇలా...

జలజీవన్ మిషన్ పథకం 2028 వరకు పొడిగింపు వల్ల జిల్లాలో ప్రతి ఇంటికి తాగునీటి సదుపాయం లభించనుంది. దేశంలో ఫ్లోరైడ్ అధికంగా ఉన్న తొలి 15 జిల్లాల్లో పల్నాడు జిల్లా 12వ స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. జిల్లాలో 27.14 శాతం నమూనాల్లో లీటర్‌కు 1.5 మిల్లీ గ్రాములకు మించి ఫ్లోరైడ్ కనిపించిందని జల్‌శక్తి నివేదిక ఇచ్చిన నేపథ్యంలో జల్‌జీవన్ మిషన్ పొడిగింపు ఉపయుక్తంగా ఉండనుంది. పల్నాడు జిల్లా అభివృద్ధికి కీలకమైన పరిశ్రమ, పర్యాటక రంగానికి ఉతమిచ్చేలా కేంద్ర బడ్జెట్‌లో నిర్ణయాలేవి తీసుకోలేదు. జిల్లాలో ఆయా రంగాల్లో అభివృద్ధికి అవసరమైన వనరులు పుష్కలంగా ఉన్నాయి. కేంద్రం ప్రత్యేక దృష్టి సారిస్తే జిల్లా అభివృద్ధికి ఎంతో మేలు జరిగేది. యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోలేదు. మొత్తంగా కేంద్ర బడ్జెట్‌పై అన్ని వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.


గిట్టుబాటు ధరలేవి?



కేంద్ర బడ్జెట్ వల్ల రైతులకు కలిగిన లాభం ఏమీ లేదు. ఎరువుల సబ్సిడీ పెంపు నిర్ణయం తీసుకోకపోవడం అన్యాయం. రైతుల ఉత్పత్తులకు గిట్టుబాట ధర లభించే విధంగా చర్యలేవీ తీసుకోలేదు. దేశవ్యాప్తంగా రైతులు, రైతుల సంఘాలు చేస్తున్న డిమాండ్‌లను పట్టించుకున్న పాపానపోలేదు.

– ఈపూరు గోపాలరావు, రైతు సంఘం నేత, పల్నాడు జిల్లా

అందుకే పెరిగిన బంగారం ధర



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేలా ఉంది. బంగారం ధరల పెరుగుదలతో కేంద్ర బడ్జెట్‌కు సంబంధం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్నిక కావడం వలన ప్రపంచ వ్యాప్తంగా బంగారానికి డిమాండ్ పెరిగింది. రూపాయి మారకం తగ్గడంతో పెట్టుబడులు పెడుతున్నారు.

– కపిలవాయి విజయకుమార్, బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షులు

సామాన్యులపై నిర్లక్ష్యం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉన్నత వర్గాల మెప్పు పొందేందుకు పనిచేస్తున్నట్లుగానే ఉంది. సామాన్యులకు అవసరమైన విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టలేదు.

–రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, చాగంటి వారిపాలెం, ముప్పాళ్ళ మండలం

చౌకగా ఆభరణాలు



కస్టమ్స్ సుంకాలు తగ్గింపు వల్ల ఆభరణాల ధరలు కొంత మేరకు తగ్గుతాయి. దీంతో వినియోగదారులకు చౌకగా లభిస్తాయి. ఆభరణాలు చౌకగా మారడంతో దేశీయ డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుంది. ఇది దేశీయంగా తయారయ్యే ఆభరణాల అమ్మకాల వృద్ధికి తోడ్పడుతుంది.

–మాదా మల్లికార్జునరావు, బులియన్ వ్యాపారి, సత్తెనపల్లి

రైతులు, కార్మికులకు నష్టం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులు, కార్మికుల పొట్టకొట్టే విధంగా ఉంది. ఉపాధి హామీ పథకానికి తగిన నిధుల కేటాయింపులు లేదు. పూర్తిగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉంది. ఆదాయ పన్ను మినహాయింపు ఉద్యోగ వర్గాలకు కొంత ఉపశమనం.

– కాసా రాంబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి

ఉద్యోగులకు కాస్త ఊరట



ఉద్యోగులకు ఆదాయ పన్నులో కొంత వెసులుబాటు వచ్చిన మాట వాస్తవమే. పన్ను రాయితీ రూ.12 లక్షలకు పెంచడం మంచి నిర్ణయం. అయితే ఇది పూర్తిస్థాయిలో ఉద్యోగులకు మేలు చేసేదికాదు. తాజా బడ్జెట్ పన్నుల విధానం వల్ల ఎగువస్థాయి ఆదాయపన్ను చెల్లించేవారికే ఎక్కువ లబ్ధి కలుగుతుంది.

– స్వర్ణ చిన్నరామిరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

రాష్ట్రానికి మొండి చేయి



నేడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్ర ప్రజల ఆశలను అడియాశలు చేశారు. బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన ద్రోహానికి ప్రజలు నిరసన వ్యక్తం చేయాలి. రాష్ట్రానికి కేంద్రం మొండిచేయి చూపింది. ప్రత్యేక హోదా ఊసేలేదు. వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను పక్కనపెట్టింది. జాతీయ విద్యా సంస్థలకు కేటాయింపులూ లేవు. పోర్టుల అభివృద్ధికిగానీ, విశాఖ రైల్వేజోన్‌కుగానీ నిధులు కేటాయించలేదు.

– ఎస్. ఆంజనేయులునాయక్, సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి

న్యూస్‌రీల్

నేటి నుంచి ఎడ్ల బండలాగుడు పోటీలు

నాదెండ్ల: గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నుంచి ఐదు రోజులపాటు జాతీయ స్థాయిలో ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఈ పోటీలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించనున్నారు. రెండు పళ్లు, నాలుగు పళ్లు, ఆరు పళ్లు, న్యూకేటగిరీ, సబ్ జూనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయని నిర్వాహకులు నల్లమోతు వేణుగోపాల్, కోటేశ్వరరావులు శనివారం తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులకు సేఫ్టీ జాకెట్స్ వితరణ



తాడేపల్లి రూరల్: మణిపాల్ హాస్పిటల్ విజయవాడ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన సేఫ్టీ జాకెట్లను శనివారం గుంటూరు పోలీసు సూపరింటెండెంట్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మణిపాల్ హాస్పిటల్ కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజీ వైద్యులు డాక్టర్ రామకృష్ణ, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ హెడ్ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఫిబ్రవరి 4 ప్రపంచ క్యాన్సర్ డేను పురస్కరించుకుని సేఫ్టీ జాకెట్స్‌ను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కర్నూలు ఫ్యామిలీ కోర్టు జడ్జిగా లీలావతి



నగరంపాలెం: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తోన్న సీనియర్ డివిజన్ సివిల్ జడ్జి టి.లీలావతి పదోన్నతిపై కర్నూలు జిల్లా ఫ్యామిలీ కోర్టు జడ్జిగా బదిలీయ్యారు. రెండు రోజుల కిందట ఆమె బాధ్యతల నుంచి రిలీవయ్యారు. ఆమె స్థానంలో న్యాయసేవాధికారి సంస్థ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా ఒకటో సబ్ కోర్టు జడ్జి గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

కృష్ణా నదిలో చేప పిల్లలు విడుదల

తాడేపల్లి రూరల్: కృష్ణా నది ఎగువ ప్రాంతం పడవల రేవు వద్ద గుంటూరు జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో శనివారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యశాఖ అధికారి పి. గాలిదేవుడు మాట్లాడుతూ ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన పథకం కింద ప్రకాశం బ్యారేజ్ రిజర్వాయర్‌లో రెండు ఫారంల నుంచి సేకరించిన 7.20 లక్షల చేప పిల్లలను వదిలామని తెలిపారు. కార్యక్రమంలో తాడేపల్లి తహసీల్దార్ డి. సీతారామయ్య, మత్సశాఖ అధికారులు, సిబ్బంది, సొసైటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

మంగళగిరి కొండపై అగ్ని ప్రమాదం



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని ఎగువ నరసింహస్వామి, గండాలయ స్వామి దేవస్థానం కొండపై శనివారం రాత్రి మంటలు చెలరేగాయి. అవి దిగువ ప్రాంతానికి కూడా వ్యాపిస్తుండడంతో నివాసితులు ఆందోళన చెందుతూ అధికారులకు ఫోన్లు చేశారు. సహజంగా ఎప్పుడూ చెలరేగే మంటలే కదా అంటూ నిర్లక్ష్యం వహించడంతో అక్కడి ప్రజలు మరింత భయాందోళనకు గురయ్యారు. చివరకు రెండు గంటల అనంతరం తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు.

స్క్రీనింగ్ క్యాంపు వాయిదా

నెహ్రూనగర్: గుంటూరు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు, వయో వృద్ధులకు ఉపకరణాలు అందించేందుకు ఫిబ్రవరి 4 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించాల్సిన స్క్రీనింగ్ క్యాంపులు వాయిదా వేసినట్లు ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్. సువార్త శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. తిరిగి క్యాంపులు నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని వెల్లడించారు.

'ఫీజు పోరు' పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి



'ఫీజు పోరు'కు వైఎస్సార్ సీపీ సిద్ధం

- కూటమి ప్రభుత్వ తీరుతో తీవ్ర అవస్థలు పడుతున్న విద్యార్థులు
- వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- 5న కలెక్టరేట్‌కు తరలిరావాలని విద్యార్థులకు, తల్లిదండ్రులకు పిలుపు

మాచర్ల: కూటమి ప్రభుత్వం తీరుతో రాష్ట్రవ్యాప్తంగా పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ ఆస్తులు తాకట్టు పెట్టి విద్యాసంస్థలకు ఫీజులు చెల్లించాల్సి రావటంతో ఆత్మహత్య చేసుకునే స్థాయికి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి సర్కార్ ఇవేమీ పట్టకుండా వ్యవహరించటం చాలా దారుణమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరుపై పోరాటానికి 'ఫీజు పోరు' చేయడానికి వైఎస్సార్ సీపీ సిద్ధమైందని చెప్పారు. శనివారం పల్నాడు జిల్లాలోని మాచర్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో 'ఫీజు పోరు' పోస్టర్లను విడుదల చేసిన తర్వాత ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. పంటలు పండక, మరోవైపు సంక్షేమ పథకాలు అందక ఆయా కుటుంబాల్లోని విద్యార్థులు చదువుకోవటానికి ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వారిని కూటమి ప్రభుత్వం అంధకారంలో ఉంచిందన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 5న బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి తమ పార్టీ నాయకులు 'ఫీజు పోరు' నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు వెంటనే ఫీజు బకాయిలను విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఫీజులు చెల్లించలేదని పలు విద్యాసంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవటం, ఇబ్బందికి గురిచేయటంతో ఆందోళన చేస్తున్నారన్నారు. కొందరు విద్యార్థులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందని చెప్పారు. గత గవర్నమెంట్ హయాంలో బకాయిలున్నాయని చెబుతున్న పాలకులు... ఆ వివరాలు ఎందుకు విడుదల చేయటం లేదని నిలదీశారు. జగన్ సీఎం అవ్వగానే గతంలో వారు పెట్టి వెళ్లిపోయిన బకాయిలను విద్యార్థులకు చెల్లించారని గుర్తుచేశారు. జగన్‌పై ఆరోపణలు చేస్తూ కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆటలాడటం సమంజసం కాదన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలలోని నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నరసరావుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి 5న తరలిరావాలని పిలుపునిచ్చారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని తెలిపారు.

నమ్మించి 'రియల్' చీట్

- చిట్‌ఫండ్ స్కాంలో బయటపడుతున్న విస్తుపోయే నిజాలు
- బిల్డప్ చూసి మోసపోయిన మధ్యతరగతి ప్రజలు
- గుండె పోటుతో ఓ బాధితుడి మృతి?
- పోలీసులకు సమాచారం ఇవ్వకుండా సెటిల్‌మెంట్
- తీవ్ర ఆవేదన చెందుతున్న పలు కుటుంబాలు
- గుంటూరు రేంజ్ ఐజీని కలిసిన బాధితులు
- తమకు న్యాయం చేయాలని వేడుకోలు

నరసరావుపేటకు చెందిన ఓ మధ్యతరగతి కుటుంబం రెక్కలు ముక్కలు చేసుకుని కూడబెట్టుకున్న సొమ్ముకు మరి కొంత వడ్డీ రూపంలో జత కూడితే పిల్లాడి చదువుకు ఉంటుందని ఆశపడింది. డబ్బు చేతికందుతుందని ఎదురుచూస్తున్న తరుణంలో సదరు వ్యాపారి బోర్డు తిప్పేసి వెళ్లాడని తెలిసి కుప్పకూలిపోయింది. నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త చనిపోగా.. పరిహారం కింద వచ్చిన సొమ్మును చిట్‌ఫండ్ సంస్థలో డిపాజిట్ చేశారు. ప్రతి నెలా వచ్చే వడ్డీతో ఆ సంస్థలోనే చీటీపాట కడుతున్నారు. కూతురి పెళ్లికి దాచిన మొత్తంతో వ్యాపారి పరారయ్యాడని తెలుసుకొని కుంగిపోతున్నారు.



నరసరావుపేట టౌన్: నరసరావుపేటలో చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్ పేరిట నమ్మకంగా ప్రజల నుంచి నగదు గుంజుకుని వ్యాపారి పరారైన ఉదంతం కలకలం రేపుతోంది. ఈ ఘటనలో రోజుకొక మోసం బయట పడటంతో నగదు దాచుకున్న వారి ఆవేదన అంతా ఇంతా కాదు. చిన్నచితకా పనులు చేసుకుని రూపాయి రూపాయి కూడగట్టుకుని ఈ ఘనుడి వద్ద పెట్టుబడిగా పెట్టిన వారు నిట్టనిలువునా మునిగారు. చీటీల రూపంలో నగదు దాచుకున్న వారు చేసేదేమీ లేక పోలీసు స్టేషన్‌కు క్యూ కడుతున్నారు. శనివారం పలువురు బాధితులు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసి నగదు పూర్తిగా చెల్లించి స్వాధీన పత్రం రాయించుకున్న వారు కొందరు, స్థలాలు కొని నాలుగోవంతు చెల్లించి అగ్రిమెంట్లు చేయించుకొన్న వారు మరికొందరు కూడా ఐజీని కలిసిన వారిలో ఉన్నారు. ప్లాట్లకు సంబంధించి నగదు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా విజయలక్ష్మీ టౌన్‌షిప్ ఎండీ పాలడగు పుల్లారావు మోహం చాటేశాడని వాపోయారు. తమతోపాటు అనేక మంది వద్ద పెద్ద మొత్తంలో నగదు తీసుకొని మోసం చేశాడని ఆరోపించారు. ఈ వ్యవహారంలో తమకు న్యాయం చేయాలని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాగా శుక్రవారం సాయిసాధన చిట్‌ఫండ్ స్కాంపై మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. చిట్‌ఫండ్ నిర్వహకుడు పుల్లారావు రూ.2.80 కోట్ల చిట్స్, డిపాజిట్స్ రూపంలో తీసుకొని మోసం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుండెపోటుతో ఒకరు మృతి?

సదరు ఐపీ పెట్టిన వ్యక్తికి సుమారు రూ.2 కోట్ల వరకు నగదును ఒక వ్యాపారి వడ్డీకి ఇచ్చారు. మోసపోయానని తీవ్ర ఆవేదనకు గురవుతూ నాలుగు రోజుల క్రితం గుండెపోటుతో మరణించారు. అయితే బాధితుడు, మోసగించిన వ్యక్తి ఒకే సామాజిక వర్గం కావడంతో వారి పెద్దలు కేసుల వరకు వెళ్లకుండా నానా ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసింది. మృతుడి బంధువులను బుజ్జగిస్తున్నట్లు సమాచారం. బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని పెద్దలు హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది.


మధ్యతరగతి వారే అధికం

రోజూ కూలినాలీ చేసుకుని సంపాదించుకున్న కొందరు ఈయన వద్ద చీటీల రూపంలో దాచుకున్నారు. అధిక వడ్డీ ఆశ చూపడంతో కట్టుకుంటూ వచ్చారు. తీరా చిట్ ఫండ్‌కు నాలుగేళ్లుగా రెన్యువల్ కూడా లేదని తెలిసి విస్తుపోతున్నారు. తమకు దిక్కెవరంటూ ఘొల్లుమంటున్నారు. చీటీలు పూర్తయిన వారు చాలా మంది తమకు రీఫండ్ చేయాలని కోరినప్పటికీ ఇల్లు నిర్మిస్తున్నామని, వేరే వ్యాపారంలో పెట్టానని సదరు వ్యక్తి చెబుతూ కాలయాపన చేసినట్టు బాధితులు వాపోతున్నారు.

ఆస్తులన్నీ తాకట్టులోనే...

చిట్‌ఫండ్ వ్యాపారి అజ్ఞాతంలోకి వెళ్లినప్పటికీ ఆయనకున్న ఆస్తులు చూసి తమ డబ్బు తిరిగి వస్తుందని పలువురు భావించారు. కానీ సుమారు రూ.20 కోట్లతో నిర్మిస్తున్న భవనం ఇప్పటికే రూ.7 కోట్లకు ఓ ప్రముఖ బ్యాంక్‌లో తాకట్టులోఉందని వారికి తెలిసిందట. వాణిజ్య భవనంపై మరో రూ.2 కోట్ల రుణం తీసుకున్నట్టు సమాచారం. ఆయన భాగస్వామిగా ఉన్న మెగా వెంచర్‌లో తన వాటా కింద రావాల్సిన మొత్తం కంటే అదనంగా రూ.7 కోట్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. బాధితులు ఇక తమ డబ్బు పరిస్థితి ఏంటంటూ గగ్గోలు పెడుతున్నారు.

నేడు కానుకమాత చర్చి తిరునాళ్ల



లూర్థుమరెడ్డి

రెంటచింతల: ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న కానుకమాత చర్చి 175వ తిరునాళ్ల మహోత్సవానికి సిద్ధమైనట్లు విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్థుమరెడ్డి తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ వేడుకల్లో కులమతాలకు అతీతంగా వేల మంది పాల్గొని కానుకమాత ఆశీస్సులు పొందాలని కోరారు. రె.ఫాదర్ జోసఫ్ గ్రాండ్, కెనడీల ఆధ్వర్యంలో 1850లో సుందరంగా ఈ చర్చి నిర్మించారన్నారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు విచారణ గురువులు ఏరువ లూర్థుమరెడ్డి, సహాయ గురువులు అగస్టీన్ మొదటి దివ్యపూజాబలి సమర్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు గుంటూరు మేత్రాసన పీఠాధిపతులు చిన్నాబత్తిన భాగ్యయ్య, కడప పీఠం అపోస్తలిక పాలనాధికారి డా. గాలి బాలి, నల్గొండ పీఠం విశ్రాంత పీఠాధిపతులు మోస్ట్ రెవ.గోవింద్ జోజి, 75 మందికి పైగా ఫాదర్లచే పండుగ పవిత్ర సమిష్టి మహోత్సవ దివ్య పూజాబలి నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 4 గంటల నుంచి కొవ్వొత్తులు, కానుకల సమర్పణ ఉంటుందని తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి పురవీధులలో తేరు ప్రదక్షిణ ఉంటుందన్నారు. జెయింట్ వాల్స్, బ్రేక్‌డాన్స్, రంగులరాట్నాలు, అంగళ్లు ఏర్పాటు చేశారని తెలిపారు.



వేడుకలకు సిద్ధమైన కానుకమాత చర్చి



క్లుప్తంగా

మార్చి 3 నుంచి ఇంటర్ దూరవిద్య పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూర విద్య) ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, ప్రభుత్వ పరీక్షల జిల్లా కోఆర్డినేటర్ కె.ఎం.ఎ.హుస్సేన్‌లు శనివారం తెలిపారు. ఈ మేరకు దూరవిద్య రాష్ట్ర డైరెక్టర్ ఆర్.నరసింహారావు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్‌లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందిన వారు పరీక్షలు రాసేందుకు అర్హులని తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలో 9 కేంద్రాలలో 2,387 మందిపరీక్షలకు హాజరు కానున్నట్లు వివరించారు. చిలకలూరి పేటలోని శారదా హైస్కూల్‌లో 302 మంది, నరసరావుపేటలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, బాలుర పాఠశాల, కాసు బ్రహ్మానందరెడ్డి పాఠశాల, శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ కలిపి నాలుగు కేంద్రాలలో 1,094 మంది, సత్తెనపల్లిలోని జెడ్పీ హైస్కూల్ (బాలికలు), జెడ్పీ హైస్కూల్ (సుగాలీ కాలనీ) కలిపి రెండు కేంద్రాలలో 526 మంది, గురజాలలోని గుడ్‌న్యూస్ హైస్కూల్‌లో 205 మంది, వినుకొండ లయోలా హైస్కూల్‌లో 260 మంది పరీక్షలకు హాజరు కానున్నారని వివరించారు. పరీక్షలు ఆయా తేదీలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. మార్చి 3 వ తేదీన ఇంగ్లిష్, 5న హిందీ, తెలుగు, ఉర్దూ, 7న రసాయన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం, 10న భౌతిక శాస్త్రం, రాజనీతి / పౌర శాస్త్రం, మనోవిజ్ఞాన శాస్త్రం, 12న గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం, 15న జీవ శాస్త్రం, వాణిజ్య/వ్యాపార శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు.

రిజర్వుడు మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం

నరసరావుపేట టౌన్: నూతన మద్యం పాలసీలో భాగంగా 10 శాతం దుకాణాలు గీత కార్మిక వర్గీయులకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని గుంటూరు జిల్లా ఎక్సైజ్ డీసీ డాక్టర్ వి. శ్రీనివాసులు అన్నారు. శనివారం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పల్నాడు జిల్లాలో 13 మద్యం షాపులకు గాను 9 గౌడ, నాలుగు గౌడ్ కులస్తులకు జిల్లా కలెక్టర్ తీసిన డ్రా ద్వారా కేటాయించారన్నారు. దరఖాస్తుకు ఈ నెల 5వ తేదీ తుది గడువు కావడంతో సాంకేతిక పరమైన అంశాలపై అవగాహన కల్పించామన్నారు. పల్నాడు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. మణికంఠ, నరసరావుపేట సీఐ సోమయ్య, సత్తెనపల్లి సీఐ, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

- రూ.3,900 కోట్లు ఫీజు బకాయిల విడుదలపై ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరణ
- విద్యార్థులు, వారి తల్లితండ్రులు, పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపు
- పార్టీ కార్యాలయం నుంచి కలెక్టర్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని వెల్లడి



ఫీజు పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి సంబంధించి రూ.3900 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం వెంటనే చెల్లించాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల ఐదవ తేదీన నిర్వహించే వైఎస్సార్ సీపీ ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు విద్యార్థినీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు సత్వరమే చెల్లించాలని కోరుతూ గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు నడిచి వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వటం జరుగుతుందన్నారు.

రాష్ట్రంలో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మొత్తం రూ.3900 కోట్లు ఉన్నాయని, వీటిలో రూ.1100 కోట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ బకాయిలనీ వివరించారు. వీటికి గాను ప్రభుత్వం కేవలం ఉడతా భక్తి కింద రూ.700 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని, మేమే బకాయిలు చెల్లించామని బడాయిలు చెప్పుకుంటున్నారని అన్నారు. బకాయిలు రాకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను పరీక్షలు రాయనీయకుండా ఇంటికి పంపిస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక పిల్లలను చదువులు మాన్పించేస్తున్నారన్నారు. కూటమిప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలవుతున్నా ఏమి చేయలేని పరిస్థితిలో ఉందని, ఏ కార్యక్రమం అమలు చేయకుండా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై నిందలు మాత్రం వేస్తున్నారని ఎద్దేవా చేశారు. సుమారు రూ.4.10 లక్షల కోట్లు ప్రభుత్వం వద్ద ఉన్నప్పటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేందుకు ఈ ప్రభుత్వానికి చేతులు రావట్లేదన్నారు. ఈ దుర్మార్గపు పాలన గురించి ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. తమ పార్టీ విద్యార్థిని, విద్యార్థుల కోసం భారీ ఎత్తున పోరాటం చేయనుందని, దీనిలో వారందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని అన్ని డిగ్రీ, ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలలకు సంబంధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా తప్పనిసరిగా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఐదవ తేదీన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అన్నీ విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు అందరూ పాల్గొనాలని కోరారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పడాల సాంబశివారెడ్డి, జిల్లా రైతు విభాగ, స్టూడెంట్ విభాగాల అధ్యక్షులు అన్నెంపున్నారెడ్డి, గుజ్జర్లపూడి ఆకాష్ కుమార్, మాజీ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఎస్.సుజాత పాల్, ఇయం. స్వామి మాస్టర్, పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, నాయకులు కురుగుంట్ల శ్రీనివాస రెడ్డి, పడాల చక్రారెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, షేక్ కరీముల్లా, సర్పంచ్ వెంకటేశ్వర రెడ్డి, గంటనపాటి గాబ్రియల్, సయ్యద్ ఖాదర్‌బాషా, ఉప్పుతోళ్ల వేణుమాధవ్, బూదాల కళ్యాణ్, ఆళ్ల మణికంఠరెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో విధ్వంసం



ఆలయంలో పడేసిన నామాల విగ్రహం



అగ్గి పెట్టటంతో మిగిలిన బూడిద

- నామాల విగ్రహం పడేసిన దుండగులు
- చిన్న విగ్రహాలు, శివలింగం విసిరేసిన వైనం
- తోరణాలను దహనం చేసి మరీ విధ్వంసం
- విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు, భక్తుల ఆందోళన
- ఆలయాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ

క్రోసూరు: వేంకటేశ్వర స్వామి ఆలయంలో దుండగులు విధ్వంసానికి పాల్పడ్డారు. పల్నాడు జిల్లా కోసూరు మండలం క్రోసూరు -సత్తెనపల్లి ప్రధాన రహదారిపై ఉన్న కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి తరువాత ఈ దారుణం జరిగింది. నామాల విగ్రహాన్ని కూలదోసి, దేవతా విగ్రహాలను విసిరివేసి తోరణాల ఆకులతో మంట పెట్టారు. శనివారం ఉదయం సమాచారం తెలుసుకున్న గ్రామ ప్రజలు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఘటనకు నిరసనగా రాస్తారోకో చేపట్టారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వారికి సర్దిచెప్పారు. నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో వారు ఆందోళన విరమించారు. స్థానికంగా ఇలాంటి సంఘటన జరగటం ఇదే ప్రథమమని, భవిష్యత్తులో ఈ తరహా దుశ్చర్యలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు సూచించారు. విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఇలాంటి నేరాలు పునరావృతంగా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సందర్శన

సమాచారం అందుకున్న పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ జేవీ సంతోష్, డీఎస్పీ ఎం. హనుమంతరావులు వెంటనే ఆలయాన్ని సందర్శించారు. పూర్తి వివరాలు సేకరించారు. దీనిపై ఎస్పీ మాట్లాడుతూ.. నిందితులను పట్టుకుంటామని, ఇప్పటికే ఒకరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ వెంట సత్తెనపల్లి రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు, క్రోసూరు సీఐ పి.సురేష్, క్రోసూరు ఎస్ఐ నాగేంద్ర రావు, అమరావతి ఎస్ఐ అమీర్, బెల్లంకొండ ఎస్ఐ ప్రవీణ్, పెదకూరపాడు ఎస్ఐ అల్లూరురెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.



రాస్తారోకోలో వీహెచ్‌పీ ప్రతినిధులు, భక్తులు

ఫ్లోర్‌బాల్ అండర్-17 జిల్లా జట్లు ఎంపిక





జిల్లా జట్టుకు ఎంపికైన బాలురు, బాలికలు

నరసరావుపేట ఈస్ట్: ఫ్లోర్‌బాల్ అండర్-17 బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలను గుంటూరు రోడ్డులోని కే-రిడ్జి పాఠశాలలో శనివారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8, 9వ తేదీలలో చిలకలూరిపేటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పల్నాడు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్, ఫ్లోర్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లవరపు కిషోర్ తెలిపారు. బాలుర విభాగంలో జి.జస్వంత్, కె.రక్షణ్ ఆనంద్, ఎస్.వీరవెంకటవరుణ్, ఎస్.శశాంక్, జె.రోహిత్, ఎల్.మణికంఠరెడ్డి, బి.వెంకటగౌతమ్, ఎం.నాగభానుప్రసాద్, ఎం.జగత్, ఎం.షణ్ముఖ్ సాయి, కె.హర్షిత్, యు.హేమచంద్ర, జె.హర్షిత్, ఎం.హేమంత్, బి.మణిదీప్, కె.సాయిచరణ్‌లు ఎంపికయ్యారు. అండర్-17 బాలికల జట్టుకు ఎం.హృదయరెడ్డి, జి.వైష్ణవి, ఎం.దీప్తిప్రియాంక, ఎస్.అశ్వత, షేక్.మహాసిన్, నిరీక్షణ, ఎస్.హంసిని, ఎ.హర్షిణి, జి.రమతేజ, జి.హాసినిలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, క్యాంపస్ ఇన్‌చార్జ్ కోట బాపూజీ, అకడమిక్ కో ఆర్డినేటర్ పుట్ట హేమంత్‌లు అభినందించారు.

లారీ ఢీకొని మిర్చి కమీషన్ వ్యాపారి మృతి



అనిల్‌కుమార్ (ఫైల్)

కారెంపూడి: లారీ ఢీకొని మిర్చి కమీషన్ వ్యాపారి మృతి చెందిన ఘటన మండలంలోని ఒప్పిచర్ల గ్రామ పెట్రోలు బంకు వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గురజాల వైపు నుంచి కారెంపూడి బైక్‌పై వస్తుండగా పెట్రోలు బంకు వద్ద ఘటన జరిగింది. ఫిరంగిపురం మండలం కండ్రిక గ్రామానికి చెందిన ఆళ్ల అనిల్‌కుమార్ (24) కమీషన్ వ్యాపారి. బైక్‌పై వస్తుండగా బంకు వద్ద ఆగి ఉన్న కారు డోరు తీయడంతో డోరుకు తగిలి రోడ్డుపై పడ్డాడు. ఇంతలో అటుగా వచ్చిన లారీ ఢీకొని అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు లారీని స్వాధీనం చేసుకున్నారు. సీఐ టీవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ వాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

మాచవరం: వసతులు లేని హాస్టల్‌కు వెళ్లాలనే బాధతో ఎలుకల మందు తాగి చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందిన ఘటన మండలంలోని మోర్జంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన విద్యార్థిని షేక్ గుల్నార్ (19) నరసరావుపేటలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చింది. సరైన సౌకర్యాలు లేని కళాశాల వసతి గృహానికి మళ్లీ వెళ్లాల్సి వస్తోందనే బాధతో డిసెంబర్ 23వ తేదీన ఎలుకల మందు నీటిలో కలుపుకొని తాగింది. చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల, గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రులలో చేర్చారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయింది. విద్యార్థిని తండ్రి ఇబ్రహీం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హోరాహోరీగా ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన

ప్రథమస్థానంలో బాపట్ల, ప్రకాశం జిల్లాల కంబైండ్ గిత్తలు



రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి 175 వజ్రోత్సవ తిరుణాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక సెయింట్ జోసెఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన నువ్వా నేనా అన్నట్లుగా పోటాపోటీగా జరిగాయి. జూనియర్ విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనలో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి, ప్రకాశం జిల్లా కాజీపేట గ్రామానికి చెందిన వి.ఓసురారెడ్డి కంబైండ్ గిత్తలు 2,734 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి రూ.80 వేలను కైవసం చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాకు చెందిన డి.రోహన్‌బాబుకు చెందిన గిత్తలు 2,700 అడుగుల దూరం లాగి రెండవ బహుమతి రూ. 65 వేలను దక్కించుకున్నాయి. వైఎస్సార్ కడప జిల్లా కల్లూరి గ్రామానికి చెందిన పి.శివకృష్ణకు చెందిన గిత్తలు 2,478.10 అడుగుల దూరంలాగి 3వ బహుమతి రూ.45 వేలను కైవశం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన ఎ.శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి గిత్తలు 2,117 అడుగులు లాగి 6వ బహుమతి రూ. 20 వేలను దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా లింగాయిపాలెం గ్రామానికి చెందిన యల్లం సాంబశివరావు గిత్తలు 2,075.8 అడుగులతో 8వ బహుమతి రూ. 10 వేలను దక్కించుకున్నాయి. గుంటూరు జిల్లా నాగులపాడు గ్రామానికి చెందిన పి. శ్రీనివాసరావు గిత్తలు 1,918.5 అడుగులు లాగి 9వ బహుమతి రూ. 9 వేలను గెలుచుకున్నాయి. పల్నాడు జిల్లా పమిడిమర్రు గ్రామానికి చెందిన వై. సుబ్బయ్య గిత్తలు 1,888.3 అడుగులు లాగి 10 వ బహుమతి రూ. 8,888 దక్కించుకున్నాయి. పల్నాడు జిల్లా రెంటాల గ్రామానికి చెందిన పి.ఈశ్వర్ ప్రణయ్ యాదవ్ కంబైండ్ గిత్తలు 1,290.7 అడుగులు లాగి 11వ బహుమతి రూ. 7,777 వేలను దక్కించుకున్నాయి. ఈ బలప్రదర్శనలో మొత్తం 12 జతలు పాల్గొన్నాయి.

ఇద్దరు ద్విచక్ర వాహన చోరులు అరెస్టు

రూ.8.50 లక్షల విలువైన 16 బైకులు స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ ప్రభాకర్‌రావు

నూజెండ్ల(శావల్యాపురం): ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8.50 లక్షల విలువైన 16 బైకులు స్వాధీనం చేసుకున్నారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు శనివారం ఐనవోలు పోలీసు స్టేషనులో విలేకర్ల సమావేశంలో తెలిపిన వివరాల మేరకు... బైకు చోరీలపై ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వివిధ గ్రామాల్లో దొంగిలించిన బైకులను నూజెండ్ల మండలం రవ్వారం కొండ వెనుక భాగాన నిందితులు దాచిపెడుతూ కొన్నాళ్లకు విక్రయిస్తున్నారని తెలిపారు. ఇలా స్వాధీనం చేసుకున్న 16 బైకుల విలువ రూ. 8.50 లక్షలని చెప్పారు. నిందితులైన రొంపిచర్ల మండలం విప్పర్ల రెడ్డిపాలెం గ్రామానికి చెందిన వనిపెంట బాలకాశిరెడ్డి, నూజెండ్ల మండలం రవ్వారం గ్రామానికి చెందిన పడిగాపాటి గురవారెడ్డిలను అరెస్ట్ చేశామన్నారు. వాహన తనిఖీల సమయంలో చిక్కిన వీరిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అసలు విషయం వెలుగులోకి వచ్చిందని వెల్లడించారు. నిందితుల అరెస్టులో ప్రతిభ చూపిన ఐనోలు ఎస్సై కృష్ణారావు, సిబ్బందిని రూరల్ సీఐ అభినందించారు. రివార్డులకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు.

వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంఘాలకు కార్యాలయాలు


నరసరావుపేట: వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల అసోసియేషన్లకు అవసరమైన కార్యాలయాలు కేటాయిస్తామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... వారికి హక్కులపై అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. ఆ శాఖ కార్యాలయాన్ని పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాల వద్ద ఖాళీగా ఉన్న బీసీ సంక్షేమ శాఖ భవనంలోనికి మార్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అందులోనే విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల అసోసియేషన్‌లకు కార్యాలయాలు కేటాయిస్తామని తెలిపారు. వయోవృద్ధులకు ప్రతి సోమవారం అర్జీలు ఇచ్చేందుకు బస్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. విభిన్న ప్రతిభావంతులు మూడు నెలలకొకసారి పింఛను తీసుకోవచ్చని అన్నారు. ఆస్తులను పిల్లలకు పంచిన తర్వాత నిరాదరణకు గురైన తల్లిదండ్రులకు నిబంధనల మేరకు న్యాయం చేస్తామని చెప్పారు. ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి సువార్త తాము అందిస్తున్న సేవల గురించి వివరించారు. డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్, ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బీవీ రంగారావు, ఎల్‌డీఎం రాంప్రసాద్, గృహ నిర్మాణశాఖ అధికారి వేణుగోపాల్, జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

పోర్టల్‌లో కార్మికుల వివరాలు నమోదు చేయండి

నరసరావుపేట: జిల్లాలో ఉన్న అసంఘటిత రంగ కార్మికుల వివరాలను మార్చి చివరిలోపు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కో ఆర్డినేషన్ సమావేశంలో పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. జిల్లాలోని అన్ని ప్లాన్లు మంజూరు చేసే మున్సిపల్ కమిషనర్లు, పంచాయితీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బీ, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, పుడా, ఏపీఐఐసీ, పరిశ్రమలు, కార్మికశాఖ అధికారులు ప్రతి నెల మూడవ తేదీలోపు ఒక శాతం సెస్ తగ్గింపు, చెల్లింపు వివరాలను పంపాలని సూచించారు. గతేడాది చైల్డ్ లేబర్ జిల్లా టాస్క్ ఫోర్సు టీం గుర్తించిన 22 మందిని బడిలో చేర్పించి, యాజమాన్యాలపై తీసుకున్న చర్యలపై చర్చించారు.

ముత్తూట్ ఫైనాన్స్ ఎదుట దంపతుల ఆత్మహత్యాయత్నం

అడ్డగోలుగా వడ్డీ లెక్కించారని ఆరోపణ



పట్టణంలోని ముత్తూట్ బ్రాంచ్ ఎదుట ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

సత్తెనపల్లి: ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలో గోల్డ్ లోన్‌కు వడ్డీ అడ్డగోలుగా లెక్కించారని ఆరోపిస్తూ శనివారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ఆ కార్యాలయం ఎదుట దంపతులు పెట్రోల్ బాటిల్ తీసుకొచ్చి ఆత్మహత్యాయత్నం చేశారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడుకు చెందిన విప్పర్ల సైదులు, మంగమ్మ దంపతులు సత్తెనపల్లి ముత్తూట్ సంస్థలో 4 సవర్ల బంగారు ఆభరణాలు కుదువ పెట్టి రూ. 85 వేలు రుణం తీసుకున్నారు. ఏడాది తరువాత రెన్యువల్ సమయంలో మరో రూ. 20 వేలు రుణంగా ఇచ్చారు. సైదులు క్రమం తప్పకుండా వడ్డీ చెల్లించడంతో పాటు అసలులో జమ వేసుకుంటూ వచ్చారు. ఫోన్ పే ద్వారా కొంత నగదు చెల్లించారు. రశీదులు ఇవ్వమని అడిగితే సర్వర్ పని చేయడం లేదంటూ సిబ్బంది దాటవేత ధోరణి అవలంబిస్తూ వచ్చారు. ఇంకా కేవలం రూ. 26,600 మాత్రమే చెల్లించాల్సి ఉందని, రూ.1.44 లక్షలు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో తమ మధ్య గొడవలు అవుతున్నాయని దంపతులు తెలిపారు. పోలీసులు దృష్టికి వెళ్లినప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోవడంతో దంపతులు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. స్టేషన్‌కు తీసుకెళ్లి మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నార్కోటిక్ పోలీసుల పేరిట బురిడీ

- యువతిని బెదిరించి రూ.11 లక్షలు స్వాహా
- కేసు నమోదు చేసిన టూ టౌన్ పోలీసులు

నరసరావుపేట టౌన్: నార్కోటిక్ పోలీసుల పేరిట బెదిరించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వద్ద రూ.11 లక్షలను సైబర్ నేరస్తులు కాజేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద చెరువు మూడవ లైనుకు చెందిన సాయిసత్యశ్రీ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోం చేస్తూ నరసరావుపేటలో ఉంటున్నారు. ఈమెకు గతేడాది అక్టోబర్ 22వ తేదీన అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తాను ముంబై నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో నుంచి మాట్లాడుతున్నానని, తన పేరు ఆకాష్ అని పరిచయం చేసుకున్నాడు. ఆమె పేరుతో ఒక కొరియర్ వచ్చిందని, అందులో లాప్‌టాప్, 450 గ్రాముల గంజాయి ఉందని చెప్పాడు. ఆమె క్రెడిట్ కార్డుతో ఇవి కొనుగోలు చేసినట్లు, సదరు క్రెడిట్ కార్డు నెంబర్ చెప్పి నమ్మించాడు. అరెస్ట్ చేస్తామని బెదిరించాడు. భవిష్యత్తు దెబ్బతినకుండా ఉండాలంటే తనకు రూ.11 లక్షలు ఇచ్చి సెటిల్ చేసుకోవాలన్నాడు. దీంతో సత్యశ్రీ తన ఖాతా నుంచి అజ్ఞాత వ్యక్తి చెప్పిన ఖాతాకు రూ.11 లక్షలు నగదు పంపారు. ఈ విషయాన్ని రెండో రోజు కుటుంబ సభ్యులకు తెలిపారు. వారిచ్చిన సలహా మేరకు అక్టోబర్ 24వ తేదీన సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి ఎటువంటి స్పందన రాకపోవడంతో శనివారం టూ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లేఖ ప్రియాంక తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

COACHING
■ షార్ట్ టర్మ్ కోచింగ్ ఫర్ (EAPCET-2025 AP & TS) అత్యుత్తమ ఫ్యాకల్టీచే విద్యా బోధన హాస్టల్ వసతి కలదు. ఇంటర్ ట్యూషన్ చెప్పబడును. సంప్ర:: శ్రీ దివ్య ఇనిస్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. 73967 55801

REAL ESTATE
■ అమరావతి రాజధాని దగ్గర్లోని కొప్పురావూరుకి ఆనుకొని ఉన్న CRDA అప్రూవుడ్ లేఅవుట్‌లోని ప్లాట్స్ గ:: 22000మాత్రమే. స్పాట్‌రిజిస్ట్రేషన్ మరియు గుంటూరు సిటీలో 1000sft కొత్తఫ్లాట్-22లక్షలు 9966960009
■ గుంటూరులో కమర్షియల్ మరియు రెసిడెన్షియల్ ఇళ్లు, స్థలాలు, పొలాలు, ప్లాట్లు అమ్మదలచినా, కొనదలచినా, సంప్రదించగలరు. 6281494079
■ గుంటూరు సిటీ గోరంట్ల అంజలి, కల్పతరువు, GPR వలపతి, లాం, వెనిగండ్ల, అగతవరప్పాడు, రెడ్డిపాలెం ప్లాట్స్ అ/కొ జనచైతన్య ప్లాట్స్ మా ప్రత్యేకత. సంప్ర:: 9553555773

AGRI LAND FOR SALE
■ మేడికొండూరు (మం) మండపాడు (గ్రా) సర్వే నెం. 82C1 లో ఎకరం 86 సెంట్లు మండపాడు-రావెల వెళ్ళే మెయిన్ రోడ్ కు ఆనుకొని ఉన్న పొలం మరియు మండపాడు గ్రామంలో 8½ సెంట్ల విస్తీర్ణంలో పెంకుటిల్లు అమ్మకమునకు కలదు 8074296586

COMMERCIAL
■ Guntur dist Chowdavaram Village 4700 sq.yds, 14000 sft commercial Godown Shed for sale. Contact: 9849925786

FLAT FOR SALE
■ రెడీ టు ఆక్యుపై 3BHK డూప్లెక్స్ 1690 sft, 2BHK 845 sft ఫ్లాట్స్ అమ్మకానికి కలవు. శ్రీ శ్రీనివాస హోమ్స్, ఆర్టీసీ కాలనీ, గుంటూరు. 9701162258, 7469916405
■ పద్మిక నివాస్: ఇన్నర్‌రింగ్‌రోడ్ రైల్వే గేట్ దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2 BHK ఫుల్ ఫినిష్ లగ్జరీ ఫ్లాట్స్ 42 లక్షలే. ఫోన్ 9848110543, 8885566086
■ గుంటూరు సిటీలోని విద్యానగర్ 3/7లో కాకతీయరోడ్‌లో నిహారిక హోమ్స్ అపార్ట్‌మెంట్స్ లో 2BHK,3BHK అన్ని వసతులతోగృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఫ్లాట్స్ అమ్మకానికి కలవు 9246483447, 9490639699

LAND FOR SALE
■ ద్వారక తిరుమల నుండి 9 కి.మీ. దూరంలో ఫామ్ ఆయిల్ తోట(6 ఎకరాలు+బోర్) & 6 ఎకరాలు+ బోర్ తో సిహెచ్.పోతెపల్లి గ్రామంలో అమ్మబడును. ఫోన్ 9581050803, 9182841766, 9533684222

OLD BUILDINGS
■ పాత బిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకుల షెడ్‌లు పగలకొట్టబడును. పాత కలప, కిటికీలు, పాత ఐరన్ కొనబడును. సంప్ర:: 9708290782, 9700442419

PLOT FOR SALE
■ గుంటూరు బస్టాండ్కి 68.కి.మీ బుడంపాడు రోడ్ కి ఇళ్ళకి అతి దగ్గర్లో 30అ. తారు రోడ్డుతో వెంచర్ నందు ప్లాట్లు చ.గజం రూ.8500/- మాత్రమే. స్పాట్ రిజిస్ట్రేషన్. 8317528192
■ గుంటూరు నుండి నరసరావుపేట రూటుకు 17KM రెండు వైపుల తారురోడ్డుకు ఆనుకొని ప్రపోజల్ ఔటర్ రింగ్ రోడ్డుకు 2KM దూరంలో 725గ::స్థలం,గ::7000మాత్రమే 9032380696
■ గుంటూరు షాప్ ఎంప్లాయీస్ కాలనీలో 293 చ::గ::ల సౌత్ ఫేసింగ్ స్థలం అమ్మకం. (E.W 62.9 S.N 42 Feet) Call: 85550 56555, 94400 21869, 98666 82222
■ 198.5 గజాల, 60 ft. 2 రోడ్ల కార్నర్ ప్లాట్ (కమర్షియల్), ఉడా లేఅవుట్ జన చైతన్య వెంచర్, తురకపాలెం రోడ్, గుజ్జనగుండ్ల సెంటర్ (రింగ్ రోడ్) నుండి 3 కి.మీ. గుంటూరు. గజం రూ.16,000. ఫోన్ 98490 23853

TO-LET
■ గుంటూరు అరండల్ పేట 16/2లో 260 చ::గ N/F తో ఆఫీస్ గోడౌన్స్ స్కూల్స్, బిజినెస్‌లకు అద్దెకు కలదు. 9703000226, 8332889646

TOLET COMMERCIAL
■ పట్టాభిపురం వెంకటరమణకాలనీ రైల్‌గేట్ దగ్గర నార్త్-ఈస్ట్ కార్నర్ బిల్డింగ్ కొత్తగా కట్టిన 6రూమ్స్+హాల్ హాస్పటల్స్‌కు ఇతర కమర్షియల్స్‌కు అద్దెకు కలదు. సంప్ర:: 9397301122
■ పేరేచర్ల బైపాస్‌రోడ్‌లో 2 ఎకరాల విస్తీర్ణంలో 30 వేల అ:: గోడౌన్‌లు అన్ని సౌకర్యములతో అద్దెకు కలవు. సంప్ర: 99498 24222
■ గుంటూరు, కొత్తపేట లిబర్టీ థియేటర్ ఎదురుగా గ్రౌండ్ ఫ్లోర్‌లో షాప్స్, గోడౌన్ ఫర్ స్టోర్ పాయింట్, ఫస్ట్ ఫ్లోర్‌లో షాప్స్ అద్దెకు కలవు. సంప్రదించండి. ✆ : 85229 25589

SERVICES

జ్యోతిష్యం
■ దుర్గాదేవి జ్యోతిష్య పీఠం: ఉద్యోగం, వివాహ ఆలస్యం, అనారోగ్యం, పునర్వివాహం, దాంపత్య సమస్యలు, ప్రేమ, ఆర్థిక ఇబ్బందులు, మీ జాతక సమస్యల కొరకు రాఘవేంద్ర జోషి గారిని సంప్రదించండి. ✆ 6364 999 444

BUSINESS OFFER
■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర:: 8376001873, 98430 10487, 8376089771, 011-25920179

BOREWELLS
■ విజయ బోర్‌వెల్స్: 4-1/2, 6-1/2, 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. గుంటూరు. సంప్ర:: 9866222717, 9848183887

PEST CONTROL
■ చెదపురుగులు బొద్దింకలు నివారణ 5సం:: గ్యారంటీ AN ISO 9001-2015 సర్టిఫైడ్ కంపెనీ, లాన్సర్ పెస్ట్ కంట్రోల్ పట్నంబజార్, గుంటూరు. 8978672624, 9848131213

WANTED
■ తెనాలిలోని మ్యారేజ్‌బ్యూరో ఆఫీస్ నందు పని చేయుటకు 4No's లేడీకంప్యూటర్ ఆపరేటర్ స్టాఫ్ కావలెను.అ:10th-డిగ్రీ, జీ.5000,T:10AM-7PM తెనాలి లోకల్ వారికి ప్రాధాన్యత 7989021063
■ ప్రముఖ సంస్థ MR Solar Systems నందు పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కావలెను.అ:10thఆపైన.జీ:30K - 40K ✆9533861044, 9154777773
■ శ్రీ హనుమాన్ డిజిటల్ నందు పని చేయుటకు Tally తెలిసిన లేడి ఆపరేటర్ మరియు లేడి రిసెప్షనిస్ట్ కావలెను. 12/1 అరండల్ పేట, గుంటూరు. ఫోన్ 89855 66667
■ కాపీరైటర్స్ కమ్ ప్రూఫ్‌రీడర్స్ కావలెను. MA, తెలుగు టూ ఇంగ్లిష్, ఇంగ్లిష్ టూ తెలుగు ట్రాన్స్‌లేషన్ చేయగల సామర్థ్యం. రెజ్యూములను hoadvtjobs@gmail.com కు పంపగలరు.
■ గుంటూరు, విద్యానగర్ 1వ లైన్, opp లిటిల్ ఫ్లవర్ స్కూల్ 4 బెడ్‌రూమ్ ప్రీమియమ్ ఫ్లాట్, కారు పార్కింగ్ సౌకర్యంతో అద్దెకు కలదు. 98491 87263
■ Wanted Experienced Female Telecallers Male Computer Operator and Office boy for Educational Consultancy in Guntur. Sal Starts From 10k.Cont: 9703115353
■ ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు Adobe Photoshop వచ్చిన లేడీ స్టాఫ్ కావలెను. జీతం: 10,000-13000/-, Time:10am to6.30pm, గుంటూరు లోకల్ వారికి ప్రాధాన్యత.7893811199
■ Wanted Male Academic Principals Qualification Any Degree/P.G. Age Limit: 30 to 45years. Salary: 30,000/- to 35,000/- working Location : Guntur. Cont: 9248733347
■ నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి నందు పనిచేయుటకు యువతీ యువకులు కావలెను. Salary - 12k to 15k, Good Incentives. Cont:9533222270, 8106284847
■ డ్రైవర్స్‌కావలెను. ఆటోమేటిక్ మరియు మ్యాన్యువల్ కారు నడిపిన అనుభవం ఉండవలెను. తగిన లైసెన్స్ ఉండాలి. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. అర్హతను బట్టి PF మరియు ESI సదుపాయంకలదు. పనిచేయుస్థలం, గుంటూరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 9248722282
■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, బోస్ట్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30 సం.లోపు జీ. 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 91771 77244
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (విజయవాడ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ బో+ వసతి +జీతం. 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 95420 47788, 92814 52843
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (హైదరాబాద్ బ్రాంచ్) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు / పేషంట్ల సేవకు వంట/ ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ బో+ వసతి +జీతం. 16-22000/- ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91332 71122, 95534 61177
■ రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ Hyd & Vja బ్రాంచీలకు 10th ఆపైన చదివిన20-50 సం:: స్త్రీ/పు టెలికాలర్స్, సూ::వైజర్లు, అడ్మిన్లు, అకౌంటెంట్లు,కా::బో+వ+జీ20-30వేలు - ఫోన్ 9491651122, 9491821122
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640258899, 9640468899

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాకేజ్ రూ. 475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటిలో ఈ వార్తాపత్రికకు ఎటువంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.